
# జీవితేచ్ఛ - మరణాకాంక్ష

## అంపశయ్య నవీన్



“జోతిష్యం మీదనాకు నమ్మకం ఉంది” అన్నాడు గోవిందరెడ్డి చాలా దృఢంగా.

“నాకులేదు” అన్నాడు సుదర్శనరావు, అంతే దృఢంగా.

ఇద్దరికీ అరవై దాటాయి. యాభయ్యేళ్ళుగా వాళ్ళిద్దరు ప్రాణస్నేహితులు. ఇద్దరికీ యే ఒక్క విషయంలో కూడా భావ సారూప్యత లేదు.

గోవిందరెడ్డి గొప్ప దైవభక్తుడు. రోజూ గంటసేపు పూజ చేస్తాడు. ఆయన విష్ణుభక్తుడు. రోజూ ‘భగవద్గీత’ పారాయణం చేస్తాడు. రామాయణం, మహాభారతం, భాగవతం ఆయనకు చాలా ఇష్టమైన గ్రంథాలు.

సుదర్శనరావు భౌతికవాదినంటాడు. దేవుడనే వాడిని మనిషే సృష్టించాడంటాడు. ''దేవుడనేవా డొకడున్నాడనీ, అంతా అతడు నిర్ణయించినట్టే జరుగుతుందనీ, అన్నిటినీ అతడే చూసుకుంటాడని అనుకోవడం వల్ల సామాన్య మానవులకు బోల్డు మానసిక ఉపశమనం లభిస్తుందనీ, ఈ కారణం వల్లనే మానవుడు దేవుడిని సృష్టించాడనీ సుదర్శన రావు అంటాడు.

''అంతా విధి (దేవుడు) నిర్ణయించినట్టే జరుగుతుందని'' గోవిందరెడ్డి అంటే ''ప్రతీది మనం నిర్ణయించినట్టే జరుగుతుంది'' అంటాడు సుదర్శనరావు.

''మన చేతుల్లో యేమీ లేదు'' అని గోవిందరెడ్డి అంటే ''అంతా మన చేతుల్లోనే ఉంది'' అంటాడు సుదర్శనరావు.

ఇద్దరూ ఉన్నత చదువులు చదివినవాళ్ళే. గోవిందరెడ్డి ఎం. ఏ. ఫిలాసఫీ చేశాడు.

సుదర్శనరావు ఎం.ఏ. ఎకనామిక్స్ చేశాడు.

గోవిందరెడ్డి వాళ్ళ తాతతండ్రులు సంపాదించిన వ్యవసాయ భూములున్నాయి. తండ్రికి ఒక్కడే కొడుకు. ఉద్యోగం, సద్యోగం అంటూ పట్టణాల్లో తిరగకుండా మన ఊర్లోనే ఉంటూ మీ ద్వారా సంక్రమించిన వ్యవసాయ భూముల్ని కాపాడుకుంటానని తండ్రికి మాటిచ్చాడు. ఆ మాటకు కట్టుబడి ఉద్యోగం చెయ్యకుండా వ్యవసాయం చేయించుకుంటూ చాలా కాలం వరకు వాళ్ళ ఊర్లోనే ఉండిపోయాడు.

సుదర్శనరావు 35 సంవత్సరాలపాటు అర్థశాస్త్రోపన్యాసకుడిగా ప్రభుత్వ కళాశాలల్లో పనిచేసి ఇటీవలనే పదవీ విరమణ చేశాడు. ఇద్దరూ ఒకే గ్రామానికి చెందినవాళ్ళు కావడంవల్ల సుదర్శనరావు పండగలకో పబ్బాలకో వాళ్ళూరు వచ్చినప్పుడు గోవిందరెడ్డిని కలుసుకొని చాలా విషయాల్ని అతనితో చర్చిస్తుండేవాడు.

నక్సలైట్ ఉద్యమం కారణంగా గోవిందరెడ్డి వాళ్ళ ఊర్లో ఉండలేని పరిస్థితి యేర్పడింది. కొంత భూమిని మిగులు భూమిగా ప్రకటించి ప్రభుత్వానికి స్వాధీనం చేశాడు. మిగతా భూమిని తనే పాలేర్లను పెట్టుకొని సాగుచేయించేవాడు. తన స్వంతూర్ని వదిలేసి వరంగల్‌లో ఉంటున్న తన కొడుకు దగ్గరకొచ్చి ఉంటూ రెండ్రోజులకొకసారి, మూడురోజుల కొకసారో తన స్వంతూరికి వెళ్ళి వ్యవసాయం పనులెలా జరుగుతున్నాయో చూసొచ్చేవాడు.

గోవిందరెడ్డికి కూడా ఒక్కడే కొడుకు. ఎం.బీ. బీ.ఎస్. చేసి వరంగల్లులో డాక్టర్‌గా ప్రాక్టీసు చేస్తున్నాడు.

సుదర్శన్‌రావు కూడా పదవీ విరమణ చేశాక వరంగల్లులో తను స్వయంగా నిర్మించుకున్న ఇంట్లో ఉంటున్నాడు. అతని కొడుకు సుకుమార్ ఐ.ఏ.ఎస్. ప్యాసై హైదరాబాద్ లోని సెక్రటేరియట్‌లో జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్నాడు.

స్నేహితులిద్దరూ ఒకే ఊర్లో ఉండటం వల్ల చాలా తరచుగా కలుసుకోవడం, యేదో విషయాన్ని గూర్చి వాదించుకోవడం జరుగుతుండేది. ఈ రోజు వాళ్ళిద్దరూ గోవిందరెడ్డి ఇంట్లో కలుసుకున్నారు.

ఈ రోజు వాళ్ళ చర్చ జ్యోతిష్యం మీదకు మళ్ళింది.

''కొందరు జ్యోతిష్కులు భవిషత్తును గూర్చి చెప్పినవి నిజమయ్యాయి'' అన్నాడు గోవిందరెడ్డి.

''నిజమైన వాటికంటే నిజం కానివే ఎక్కువున్నాయి'' అన్నాడు సుదర్శనరావు.

''అందరూ జ్యోతిష్యం చెప్పలేరు. గ్రహాలను, నక్షత్రాలను గూర్చిన సంపూర్ణ జ్ఞానం ఉన్న గొప్ప జ్యోతిశ్శాస్త్ర పండితులు మాత్రమే భవిష్యత్తును గూర్చి కరెక్ట్‌గా చెప్పగలరు. మరో విషయం... ఒక వ్యక్తి పుట్టిన లేదీ, పుట్టిన సమయం సెకండ్లతో సహా కరెక్ట్‌గా రికార్డు చెయ్యబడి ఉంటేనే ఆ వ్యక్తి భవిష్యత్తును గూర్చి కచ్చితంగా చెప్పడానికి వీలౌతుంది''.


''అసలు మీ జ్యోతిష్యం శాస్త్రమే కాదు... జ్యోతిష్యాన్ని శాస్త్ర అనడం శాస్త్రాని.. అంటే సైన్స్‌ను అవమానించడమే... ఎందుకంటే జ్యోతిష్యం గ్రహాలు కాని వాటిని గ్రహాలు అంటుంది. ఉదాహరణకు సూర్యుడిని, చంద్రుణ్ణి గ్రహాలుగా భావిస్తుంది. అవి గ్రహాలు కానేకావు. సూర్యుడోనక్షత్రం- చంద్రుడో ఉపగ్రహం. ఇక్కడే మీ జ్యోతిశ్శాస్త్రం పప్పులో కలేసింది. ఇంకో గమ్మత్తేమిటంటే మీ జ్యోతిష్యులు రాహుకేతువుల్ని గ్రహాలంటారు. ఈ రాహుకేతువులనే గ్రహాలెక్కడున్నాయో ఎవరికీ తెలీదు...అసలవి లేనే లేవు''

''అవి ఎక్కడున్నాయో మీకు తెలియకపోవచ్చు. జ్యోతిష్యులకు తెలీదనటం మీ అజ్ఞానం. గ్రహాలను గూర్చి, గ్రహగతులను గూర్చి తెల్సియకపోతే మన పంచాంగ కర్తలు వేల సంవత్సరాల నుండే ఫలానా రోజు, ఫలానా టైమ్‌కు సూర్యగ్రహణం సంభవిస్తుందనీ, చంద్రగ్రహణం సంభవిస్తుందనీ ఎలా కరెక్ట్‌గా లెక్కవేసి చెప్పగల్గారంటావు?''

''సూర్య గ్రహణాన్ని గూర్చి, చంద్రగ్రహణాన్ని గూర్చి చెప్పడం అంత గొప్పేమీకాదులే. ట్రయల్ అండ్ ఎర్రర్ అనే మెథడ్ ద్వారా మన పూర్వులు కొన్ని ప్రకృతి రహస్యాలను తెలుసుకోగల్గారు. ముఖ్యంగా ఖగోళశాస్త్రంలో మనవాళ్ళు గొప్ప విజయాలనే సాధించారు. కానీ మనవాళ్ళు శాస్త్రాన్ని; మూఢనమ్మకాల్ని కలగల్పారు. సూర్య చంద్ర గ్రహణాలెప్పుడు ఏర్పడ్తాయో చెప్పడం గొప్ప విషయమే. కానీ సూర్యుణ్నీ చంద్రుణ్నీ రాహుకేతువులనే గ్రహాలు మింగేస్తాయనీ, గ్రహణం అనేది అపశకునమనీ, ఆ సమయంలో యే పనులూ చెయ్యకూడదనీ, గర్భిణీస్త్రీలు కదలకుండా పడుకోవాలనీ... ఇవన్నీ మూఢనమ్మకాలు. గ్రహణాలెందుకు సంభవిస్తాయో ఇప్పుడు సైన్స్ కరెక్ట్‌గా రుజువులతో సహా నిరూపిస్తున్నది. అదే మీ జ్యోతిష్యం దేన్నీ రుజువు చెయ్యదు. యేవో కొన్ని కొండగుర్తుల ఆధారంగా చెయ్యబడే ఊహలు యాదృచ్ఛికంగా నిజం కావొచ్చు. వంద జోస్యాలలో ఒకటి నిజమైతే చాలు, జ్యోతిష్యం నిజమైందన్న ప్రచారం జరుగుతుంది. నిజం కాని తొంబయి తొమ్మిదింటిని మరచిపోతారు''

''యేదైనా జ్యోతిష్యం నిజం కాలేదంటే అది జ్యోతిష్యం తప్పుకాదు. జ్యోతిష్కుడి తప్పే ఉండాలి. జ్యోతిష్కుడు అసమర్థత కారణంగా తప్పుడు జ్యోస్యాలు వెలువడ్తాయి.''

''మీ జ్యోతిష్యం లేక జ్యోతిశ్శాస్త్రం అనేది ఒక ముఖ్యమైన ప్రాతిపదికను ఆధారం చేసుకొని నిర్మించబడింది. ఈ భూమ్మీద యేం జరగబోతున్నదో ముందే నిర్ణయమైపోయిందన్నదే ఆ ప్రాతిపదిక. ఇలా జరగాలని ముందే ఎవరో అంటే యే భగవంతుడో నిర్ణయించాడు. అలా నిర్ణయమైపోయిన దాన్ని గ్రహగతుల ఆధారంతో, నక్షత్రగతుల ఆధారంతో ముందే మనం తెలుసుకోవచ్చునని జ్యోతిష్యం నమ్ముతుంది. కానీ ఆ ప్రాతిపదికే తప్పు. ఇలా జరగాలనో, జరుగుతుందనో ముందే ఎవరూ నిర్ణయించలేరు. కోట్ల కోట్ల మైళ్ళదూరంలో ఉన్న గ్రహాలకూ, మన వ్యక్తిగత జీవితాలకూ ఎలాంటి సంబంధం లేదు. ప్రతి మనిషికీ తన భవిష్యత్తేమిటో తెలుసుకోవాలన్న తపన ఉంటుంది. మనిషిలోని ఈ బలహీనతను ఆధారం చేసుకునే జ్యోతిష్కులు పుట్టారు. యే జ్యోతిష్కుడు కూడా ఇరవయ్యో శతాబ్దంలో మానవ జీవితం ఇవ్వాళ్ళ మనం చూస్తున్నట్టుగా మారిపోతుందనీ జోస్యం చెప్పలేదు. ఈ



హైటెక్ యుగం... ఈ కంప్యూటర్లు... ఈ సెల్‌ఫోన్లు... ఈ ఇంటర్నెట్టులు, ఈ వెబ్‌సైట్లు, ఈ ఔట్ సోర్సింగులు, ఈ ఆఫ్‌షోరింగులూ, ఈ ఆటం బాంబులు, ఈ హైటెక్ పరిశ్రమలు, ఈహైటెక్ యుద్ధాలు... ఈ విశ్వాంతర ప్రయాణాలు...వీటిని గూర్చి యే జ్యోతిష్కుడైనా ఊహించగల్గాడా?''

''ఎందుకు ఊహించలేదు? నాస్ట్రాడామస్ అనే ఫ్రాన్స్ దేశానికి చెందిన జ్యోతిష్కుడు వీటన్నింటిని ఊహించాడట. మొన్న న్యూయార్క్‌లో జరిగిన డబ్ల్యూటీవో టవర్ల పేల్చివేతను గూర్చి కూడా నాస్ట్రాడామస్ జోస్యం చెప్పాడని పత్రికల్లో చదివాను''

''ఈ నాస్ట్రాడామస్ అనే వాడొక పెద్ద మిత్. ఇతడు పదహారో శతాబ్దంలో ఫ్రాన్స్‌లో జీవించాడని చెప్పడానికి ఆధారాలున్నాయి. ఇతడు డాక్టర్‌గా ప్రాక్టీస్ చేశాడని, ఆ రోజుల్లో ఫ్రాన్స్‌లో ప్లేగు వ్యాధి సంభవించినప్పుడు చాలా మంది ప్లేగు సోకిన రోగుల్ని తన వైద్యంతో రక్షించాడని చెబుతారు. అయితే తన స్వంత భార్యా బిడ్డలక్కూడా ఆ వ్యాధి సోకినప్పుడు వాళ్ళను రక్షించలేకపోయాడట! వైద్యంతో బాటు ఈయన జ్యోతిష్యం కూడా చెబుతుండేవాడట. తన జ్యోతిష్యాన్ని పది పుస్తకాల్లో నాలుగు లైన్ల కవిత్వం లాంటి నిగూఢమైన భాషలో నిక్షిప్తం చేశాడట. ఆ పది పుస్తకాల్లో వందజోస్యాలు... ఎవరికీ సులభంగా అర్థంకాని భాషలో చెప్పాడు. అతని జోస్యాలకు అతని వీరభక్తులు కొందరు ఎవరిష్టమొచ్చినట్టుగా వాళ్ళు భాష్యాలు చెప్పారు. అతడేదో చెబితే వీళ్ళేదో అప్పుడు జరుగుతున్న సంఘటనలకు కుదిరేట్టుగా అన్వయించి చెప్పారు. అయినా అతడు చెప్పాడని అతని శిష్యులు ప్రచారం చేసిన ఒక జోస్యం ఘోరంగా విఫలమైంది కదా! 1999లో మహా ప్రళయం సంభవిస్తుందని మీ నోస్ట్రాడామస్ చెప్పాట్ట... అది నిజమైందా? 1999వ సంవత్సరం చాలా ప్రశాంతంగా గడిచిపోయింది కదా!''

''అవన్నీ వదిలెయ్ సుదర్శన్... నా జీవితాన్నే తీసుకో... నా జాతకం చూసి మా ఆస్థాన జ్యోతిష్కుడు చెప్పినవన్నీ నిజమయ్యాయి. నా పుట్టిన తేదీని, పుట్టిన సమయాన్ని మా నాయనగారు కరెక్ట్‌గా రికార్డు చేశాడు. దాన్ని ఆయన మా యింటికి ఎప్పుడూ వచ్చే నృసింహరామశాస్త్రి అనే జ్యోతిష్కుడికి చూపిస్తే నా భవిష్యత్తును గూర్చి ఆయన చాలా విషయాలు చెప్పాడు. నేను చాలా పెద్ద చదువులు చదువుతానని చెప్పాడు. కానీ ఉద్యోగం చెయ్యడనీ, మీ ఊర్లోనే ఉండి వ్యవసాయం చేసుకుంటాడని చెప్పాడు. పదిహేనవ యేటనే పెళ్ళవుతుందనీ, చాలా గుణవంతురాలైన భార్య దొరుకుతుందనీ, ఒక్కడే కొడుకు పుడ్తాడని చెప్పాడు. ఇవన్నీ నా చిన్నప్పుడే చెప్పాడు. అన్నీ నిజమయ్యాయి...''

''ఇవి చెప్పడానికి పెద్ద జ్యోతిష్యుడక్కర్లేదు గోవింద్! కొంచెం కామన్‌సెన్స్ ఉన్నవాడెవడైనా చెప్పగలడు. మీది జమీందారుల కుటుంబం. కాబట్టి మీ నాయనగారు నిన్ను పెద్ద చదువులు చదివిస్తాడని సులభంగా ఊహించవచ్చు. మీ నాయనగార్కి తన భూములతో చాలా బలమైన అనుబంధం ఉందని అందరికీ తెలుసు. కాబట్టి ఆయన నిన్ను ఉద్యోగంచెయ్యనీయడనీ, వ్యవసాయమే చ్యెమంటాడని ఎవరైనా ఊహించగలరు. ఇక నీ పెళ్ళంటావా... ఆ రోజుల్లో పద్నాలుగు పదిహేనేళ్ళకే పెళ్ళిళ్ళు చేసేవాళ్ళు. మీ నాయనగార్కి నువ్వొక్కడివే సంతానం...కాబట్టి నీకూ ఒక్కడే పుడ్తాడని ఆ జ్యోతిష్కుడు ఊహించి ఉంటాడు. యాదృచ్ఛికంగా అతని ఊహనిజమైంది. ఇంతకు మించి ఆ జ్యోతిష్కుడు చెప్పిందేమీలేదు''

''నువ్విలాగే మాట్లాడ్తావులే... ఎన్నో లెక్కలు వేసి, గ్రహగతుల్ని తెలుసుకొని ఆయన ఈ విషయాలు చెప్తే నువ్వేమో గెస్ చేసి చెప్పాడంటున్నావు.''

''నిన్ను నమ్మించడానికే ఆలెక్కలన్నీ చెప్పేవాడు. ఇవి చెప్పినందుకు మీ దగ్గర బాగానే పట్టించి ఉంటాడు''.

''అతడు మా నాయనగార్కి ఆస్థాన జ్యోతిష్కుడు. నెలకో రెండు నెలలకో ఆయన మా యింటికొస్తుండేవాడు. అట్లా వచ్చినప్పుడల్లా తృణమో, ఫణమో... మే ఎంతిచ్చినా తీసుకునేవాడు.''

''మీరు మీ హోదాకు తగ్గట్టే ఇస్తారని అతనికి తెలియదా? అతడింకా యేం చెప్పాడేమిటి?''

''ఆయన అన్నీ ఒకేసారి చెప్పేవాడు కాదు. వచ్చే పదేళ్ళలో యేం జరుగుతుందో చెప్పేవాడు. అలా ఒకసారి మా నాయనగార్కి ఆయన అరవయ్యో యేట పెద్ద గండముందని, జాగ్రత్తగా ఉండాలని చెప్పాడు''.

''జాగ్రత్తగా ఉండమని చెప్పడం దేనికి? జరిగేది జరుగుతుందనే కదా మీ జ్యోతిష్యం చెప్పేది''

''అవుననుకో...కానీ మనం చేసే ప్రయత్నం మనం చెయ్యాలిగదా...''

''యేం చేశారు? యజ్ఞాలు, యాగాలు చేసుంటారు... అయినా మీ నాయనగారు అరవయ్యో యేట చనిపోయారు''

''అవును... జ్యోతిష్కుడి జోస్యం నిజమైందా? లేదా?''

''కేవలం యాదృచ్ఛికంగా జరిగిన సంఘటన అది. నాకు గుర్తుంది.... మీ నాయనగారు మీ మేనత్తగారి ఊరికెళ్ళొస్తూ బండి బోల్తా పడటం వల్ల చనిపోయాడు''

''మా జ్యోతిష్కుడు చెప్పింది నిజమైందా? లేదా?''


''ఆయన కాకి లెక్కల ప్రకారం ఆ నెలలో యేదో ప్రమాదం జరుగుతుందని తెలిసి ఉంటుంది. అది నిజంగానే జరగటం కేవలం యాధృచ్ఛికం. మరో విషయం... ఒక్కొక్కసారి మనం దేన్ని కోరుకుంటామో అదే జరుగుతుంది. విల్‌పవర్...అంటే సంకల్పబలం వల్ల కొన్ని జరుగుతాయి. 'యద్భావం తద్భవతి' అంటారు చూడండి... మీ నాయన గార్కి మీ జ్యోతిష్కుడు జూలై నెలలో గండముందని చెప్పాడు గదా... దాంతో మీ నాయన గారి మనసులో ఆ మాట బాగా నాటుకుపోయి ఉంటుంది. యేదో ప్రమాదం తప్పకుండా జరుగుతుందని ఆయన అనుకొని ఉంటాడు. ప్రతి మనిషిలో జీవితేచ్ఛతో బాటు మరణకాంక్ష కూడా ఉంటుందని సైకాలజిస్టులు చె బుతారు. మీ నాయన గారిలో ఆ జ్యోతిష్కుడి కారణంగా ఫలానారోజు చనిపోవాలన్న కాంక్ష కూడా నాటుకుపోయి ఉంటుంది. ఈ కారణాల వల్లకూడా ఆ బండి ప్రమాదం జరిగి ఉంటుంది''

''నువ్వు ఎన్నైనా చెప్పు...అంతా విధి నిర్ణయం ప్రకారమే జరుగుతుంది. విల్‌పవర్... మరేదో, మనిషి ఎప్పుడు చనిపోవాలని నిర్ణయమైందో అప్పుడే చనిపోతాడు. కాణాలేవైనా కావొచ్చు. యేది ఎప్పుడు జరగాలో అప్పుడు జరిగి తీరుతుంది''.

''అది సరె...నేనో విషయం చెబితే ఆశ్చర్యపడ్తావేమో''

''యేమిటది?''

''మా నాయన గారు కూడా నా పుట్టిన తేదీని, టైమ్‌నూ కరెక్ట్‌గానే రికార్డు చేశాడు. నా జాతకం కూడా రాయించాడు. ఓ పెద్ద జ్యోతిష్కుని పిలిపించి నా భవిష్యత్తెలా ఉంటుందో చెప్పమన్నాడు. నా కప్పుడు ఎనిమిదేళ్ళుంటాయి. ఆ జ్యోతిష్కుడు నా భవిష్యత్తును గూర్చి చెబుతున్నప్పుడు నేను స్వయంగా విన్నాను. నాకు పెద్దగా చదువురాదన్నాడు. ఎలాగో మెట్రిక్యులేషన్ వరకు నెగ్గుకొస్తాడ



న్నాడు. నా పన్నెండో యేట నాకో గండం ఉంద న్నాడు. ఆ గండం తప్పితే చాలాకాలం బతుకుతా డన్నాడు. ఉద్యోగయోగం లేదన్నాడు. వ్యవ సాయం కూడా చెయ్యడన్నాడు. ఇనుము వ్యాపారం లాంటి వ్యాపారమేదో చేస్తాడన్నాడు. ఇవేవీ జరగలేదు కదా.... దీనికేమంటావు?''

''ఆ జ్యోతిష్కుడికి గ్రహగతుల్ని గూర్చి పెద్దగా తెలిసుండదులే''

''అది చాలా పొరపాటు. ఆ జ్యోతిష్కుడు నీక్కూడా తెలుసు. మీ ఆస్థాన జ్యోతిష్కుడి తమ్ముడే... చాలా మంచి పేరున్నవాడే. అతడు చెప్పిన చాలా జోస్యాలు కూడా నిజమయ్యాయని చెప్పుకునేవాళ్ళు. అతడు నాకు మరో జోస్యం ఛాలెంజ్ చేసి మరీ చెప్పాడు. అది వింటే నువ్వు చాలా ఆశ్చర్యపడ్తావు''

''యేమిటది?''

''నాకిద్దరు భార్యలని చెప్పాడు. ఇది నిజం కాకపోతే తన చెవి కోయించుకుంటానన్నాడు. ఆయన చెప్పిన ఈ మాటను మా నాయనగారు నమ్మారు. నీకు తెలుసుకదా... నా పద్నాల్గవ యేటనే నాకు పెళ్ళయింది. నా భార్యకప్పుడు పన్నెండేళ్లే. నాకు పద్దెనిమిదేండ్లు వచ్చేటప్పటికే నా భార్య గర్భవతైంది. అపుడామెకు పదహారేళ్లే. ఆమెకు ప్రసవం చాలా కష్టమైంది. ఆ రోజుల్లో సిజేరియన్ అంటే అందరూ భయపడేవాళ్ళు. లోపల బేబీకి కాళ్ళు మలచుకుపోయాయని, వెంటనే సిజేరియన్ చేసి బేబీని బయటకు తీయకపోతే తల్లికీ బిడ్డకీ... ఇద్దరికీ ప్రమాదమేనని డాక్టర్ చెప్పేటప్పటికి మేమందరం హడలిపోయాం. మా నాయన గారైతే ఆమె చనిపోవడం ఖాయమనుకున్నాడు. ఆపరేషన్ చేసి బేబీని బయటకు తీశాక కూడా పోస్టు ఆపరేషనల్ ప్రాబ్లెమ్స్ చాలా వచ్చాయి. ఒక దశలో ఇక ఆశ లేదనుకున్నాం. మా నాయనగారు అప్పుడే నాకు రెండో పెళ్ళి తప్పదనీ, నా మొదటి భార్య చనిపోగానే నాకు మా అక్కయ్య కూతుర్నిచ్చి చెయ్యాలని కలలుగనటం మొదలెట్టాడు. నా పెళ్ళయినప్పుడు నా మేనకోడలు మరీ చిన్న పిల్ల. ఆమెకప్పటికింకా పెళ్ళీడు రాలేదు. ఇక మా అమ్మగారేమో వాళ్ళతమ్ముని కూతుర్ని నాకు భార్యగా తీసుకురావాలని ఆలోచించడం మొదలెట్టింది.''

''అదృష్టవశాత్తు వాళ్ళిద్దరి కలలూ నిజం కాలేదు. నెలరోజుల తర్వాత నా భార్య పరిస్థితి మెరుగైంది. మాకు ముగ్గురు పిల్లలు. మేం హాయిగా ఉంటున్నాము. జ్యోతిష్కుడు చెప్పినట్టు నాకు రెండోపెళ్ళి జరగదుగాక జరగదు. ఐదేళ్ళ క్రితం అనుకుంటాను, నాకోసారి ఆ జ్యోతిష్కుడు హైదరాబాద్‌లో కలిశాడు. జ్యోతిష్కుడుగా ఆయ నిప్పుడు హైదరాబాద్‌లో పెద్ద బోర్డు పెట్టి, ఆఫీసు ఓపెన్ చేసి జ్యోతిష్యం ప్రాక్టీసు చేస్తూ లక్షలు సంపాదిస్తున్నాడు. ఆయన దగ్గరకు మంత్రులు, ఎం. ఎల్. ఎలు, బడా వ్యాపారులు, కంట్రాక్టర్లు వచ్చి జోస్యాలు చెప్పించుకుంటారు. నాకతడు ఓ షాపులో అనుకోకుండా కలిశాడు. ''బావున్నారా? '' అని అడిగాడు. ''మీరు నాకు ఇద్దరు భార్యలని చెప్పారు. అది జరగకపోతే చెవి కోయించుకుంటా నన్నారు. కానీ అలా యేం జరగలేదు అన్నాను''

''అప్పుడాయనేమన్నాడు?''

''మీ జ్యోతిష్కులు ఓటమిని అంత సుల భంగా అంగీకరిస్తారా? అప్పుడే యేమయ్యింది. నీకిప్పుడెన్నేళ్ళు?'' అన్నాడు. ''అరవై దగ్గరపడ్తున్నాయన్నాను. నీకు అరవై ఐదు వచ్చేలోగా నీకు రెండో పెళ్ళి జరుగుతుంది చూడు...అన్నాడు. అలా జరగదని నేనతనితో ఛాలెంజ్ చేసి చెప్పాను. నాకిప్పుడు అరవై ఐదేళ్ళొచ్చాయి. నేనూ నా భార్య హాయిగానే ఉన్నాం!''

''ఆశ్చర్యమే! నీ విషయంలో జ్యోతిష్కులు చెప్పినవేవీ జరగలేదు. నా విషయంలో అన్నీ జరిగాయి. నువ్వు జ్యోతిష్యాన్ని నమ్మవు కాబట్టి, నేను జ్యోతిష్యాన్ని నమ్ముతాను కాబట్టి ఇలా జరిగిందేమో...యేదైనా నమ్మకాన్ని బట్టి జరుగుతాయేమో... అంతేనంటావా?''

వాళ్ళిద్దరు అలా మాట్లాడుకుంటుండగానే అక్కడికి గోవిందరెడ్డి కొడుకు డాక్టర్ కృపాకర్‌రెడ్డొచ్చాడు.


''నమ్మకం అనేది మనిషి జీవితాన్ని చాలా ప్రభావితం చేస్తుంది, నమ్మకాన్నే నేను 'విల్‌పవర్' అంటాను. మనం ఇలా జరుగుతుందనో, జరగాలనో గాఢంగా అనుకుంటే అలా జరుగుతుందన టానికి నా దగ్గర రుజువులున్నాయి'' అన్నాడు సుదర్శనరావు.

''యేమిటా రుజువులు?'' అన్నాడు గోవింద రెడ్డి.

''నా జీవితమే ఆ రుజువు. నేను చదువులో పెద్దగా తెలివైనవాడిని కాను. నేనసలు పదోతర గతి కూడా ప్యాసవుతానో లేదో అనుకున్నారు నా క్లాస్‌మేట్స్. కానీ నేను ఎం.ఏ ఎకనామిక్స్ చాలా మంచిమార్కులతో ప్యాసయ్యాను. ఇది ఎలా జరిగిందనుకున్నారు? నా విల్‌పవర్... నా సంకల్ప బలం. ఎం.ఏ. ప్యాసై లెక్చరర్‌గా ఉద్యోగం సంపాదించాలనుకున్నాను. రాత్రింబవళ్ళు కష్టపడ్డాను. ''బి. ఎలో యావరేజి స్టూడెంట్'' అన్న ముద్రపడ్డ నేను ఎం.ఏ. హైయర్ సెకండరీ క్లాసులో ప్యాసై లెక్చరర్ ఉద్యోగం సంపాదించాను. తర్వాత ఐదేళ్ళు కష్టపడి పిహెచ్‌డి చేశాను. నేను రాసిన కొన్ని పేపర్స్ ఇంటర్నేషనల్ జర్నల్స్‌లో ప్రచురించ బడ్డాయి. రెండుసార్లు యూరోప్ అండ్ అమెరికాలకు విజిటింగ్ ప్రొఫెసర్‌గా వెళ్ళొచ్చాను. మరో విషయం కూడా మీకు చెప్పాలి. నా కొడుకును ఐ.ఏ.ఎస్. ఆఫీసర్ని చెయ్యాలనుకున్నాను. చిన్నప్పట్నించే వాడిని ఆ లైన్‌లో పెట్టాను. వాడు నేను చెప్పినట్టే వింటూ చాలా కష్టపడ్డాడు. ఐ. ఏ. ఎస్. ప్యాసై కొంతకాలం కలెక్టర్‌గా చేసి ఇప్పుడు సెక్రటేరియట్‌లో జాయింట్ సెక్రెటరీగా పనిచేస్తున్నాడు. ఇలా జరుగుతుందని నా జాతకం చూసిన యే జ్యోతిష్కుడూ చెప్పలేదు. ఇదంతా కేవలం నా సంకల్పబలంతోటే జరిగిందని నేనుకుంటున్నాను'' అన్నాడు సుదర్శన్‌రావు.

''ఎంతైనా నువ్వు చాలా అదృష్టవంతుడివోయ్ సుదర్శన్...నువ్వు జ్యోతిష్యాలను నమ్మకపోయినా ఇలా జరగాలని నీ జాతకంలో ఉండే ఉంటుంది. సరి అయిన జ్యోతిష్కుడెవరూ నీ జాతకాన్ని చూసి నట్టులేదు. నీ విషయంలో దైవసంకల్పానికి తోడు మానవ సంకల్పం కూడా తోడయ్యింది'' అన్నాడు గోవిందరెడ్డి.

''నాకైతే మీ ఇద్దరి వాదన కూడా కరెక్టనిపించడం లేదు. కొన్ని ఎందుకు జరుగుతాయో, కొన్ని ఎందుకు జరగవో ఎవరూ చెప్పలేదు. ఎంత సంకల్పబలమున్నా కొన్ని జరగవు. కొన్ని ఎందుకు జరగవో ఎవరూ చెప్పలేరు. ఎంత సంకల్పబల మున్నా కొన్ని జరగవు. కొన్ని జరుగుతాయి... ఇలాగే ఎందుకు జరగాలంటే ఎలా జరగాలని ఇది వరకే ఎవరో నిర్ణయించారన్న వాదనను కూడా నేను నమ్మలేను...చాలా సంఘటనలు చాలా యాధృచ్ఛికంగా జరుగుతాయి....అంతే! జీవితాన్ని యే చట్రంలో కూడా బిగించి చూడకూడదని నా అభిప్రాయం.



ఎందుకంటే మానవ జీవితాలు చాలా సంక్లిష్ట మైనవి. యే సిద్ధాంతంలోనూ ఇమిడేవికావు'' అన్నాడు అంతసేపూ నిశ్శబ్దంగా ఉన్న కృపాకర్ రెడ్డి.

''జీవితం యే సిద్ధాంతంలోనూ ఇమిడదన్న మాట నిజమే. కానీ ప్రతివ్యక్తికీ అతనికి తెలిసో తెలి యకో ఒక తాత్త్విక భూమిక ఉంటుంది. ఆ తాత్త్విక భూమికకు తగ్గట్టుగానే అతని జీవితం సాగుతుంది'' అన్నాడు సుదర్శనరావు.

''నిజమేనేమో...'' అన్నాడు కృపాకర్‌రెడ్డి.

అలా వాళ్ళు ముగ్గురు చాలాసేపు మాట్లాడు కొని విడిపోయారు. మళ్ళీ కలుసుకున్నప్పుడు కూడా ఈ విషయాలను గూర్చే చర్చించుకున్నారు. వాళ్ళ సిద్ధాంతాలను రుజువు చేసే ఎన్నో సంఘట నల్ని గూర్చి చెప్పుకున్నారు.

మరో ఐదేళ్ళు గడిచిపోయాయి.

గోవిందరెడ్డి ఇంకో ఆర్నెల్లకు తన డెబ్బయ్యో జన్మదినం జరుపుకోబోతున్నాడనగా వాళ్ళింటికి వాళ్ళ ఆస్థాన జ్యోతిష్కుడొచ్చాడు. ఈసారి అతడేం చెబుతాడోనని గోవిందరెడ్డి చాలా ఆసక్తిగా ఎదురు చూశాడు.

''మీరు మీ సప్తతి ఉత్సవాన్ని జరుపుకోవడా నికి నెలరోజుల ముందే మీ భార్యకో పెద్దప్రమాదం జరగబోతున్నది'' అన్నాడు వాళ్ళ జ్యోతిష్కుడు. ఈ మాట చెప్పేసి అతనికి రావలసిన పారితోషి కాన్ని స్వీకరించి ఆ జ్యోతిష్కుడు వెళ్ళిపోయాడు. కొద్దిరోజుల దాకా గోవిందరెడ్డి ఈ విషయం వాళ్ళింట్లో ఎవరికీ చెప్పలేదు. తర్వాతొకసారి వాళ్ళింటికి సుదర్శనరావొచ్చినప్పుడు ఆయనకు చెప్పేశాడు.

సుదర్శనరావు నవ్వాడు.

''నువ్వు జ్యోతిష్యం పిచ్చిలో పడిపోయావు గోవింద్! మా చెల్లెమ్మ అన్నపూర్ణకేమీకాదు. యేదో అవుతుందని ఊహించుకోకు'' అన్నాడు సుదర్శన రావు.

''యేమోనోయ్... ఆ మాటవిన్నప్పట్నించీ నాకు భయమేస్తోంది. ఈ వయస్సులో భార్యను పోగొట్టుకోవడం కంటె విషాదమేముంటుంది చెప్పు'' అన్నాడు గోవిందరెడ్డి.


''పిచ్చిగా మాట్లాడకు. జ్యోతిష్కుడేదో ప్రమా దముందని చెప్పినంత మాత్రాన ఆమె నీ జీవి తంలోంచి శాశ్వతంగా వెళ్ళిపోతుందని ఊహించు కుంటున్నావా? అలాంటి ఊహల్ని నీ బుర్రలోకి రానివ్వకు. నా మొదటి భార్య చనిపోతుందని, నేను రెండో పెళ్ళి చేసుకుటానని ఓ జ్యోతిష్కుడు ఢంకా భజాయించి చెప్పాడు. అది జరిగిందా? నువ్వు నా జీవితాన్నే గీటురాయిగా తీసుకో. ఎప్పుడూ మంచే జరుగుతుందని పాజిటివ్‌గా ఆలోచించు. నెగిటివ్‌గా ఆలోచిస్తే కొన్నిసార్లు నెగి టివ్‌గానే జరుగుతాయి'' అన్నాడు సుదర్శన్‌రావు.

వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటుండగానే వాళ్ళ మధ్యలోకి అన్నపూర్ణ వచ్చింది.

''ఆయన పాజిటివ్‌గా ఎప్పుడు ఆలోచించాడ న్నయ్యా! ఆ జ్యోతిష్కుడు యేం చెబితే దాన్ని నమ్మేస్తాడు. మొన్న ఆ మహాశయుడొచ్చి మీ భార్యకు గండముందని చెప్పినప్పట్నించీ నేనిక పోతానని అనుకుంటున్నాడు. నాకీ విషయం చెప్పొద్దనుకున్నాట్ట..అలా ఉన్నారేమిటి అని పట్టు బట్టి అడిగితే చెప్పారు. నేను ఈ వార్త వింటె భయ పడ్తానని నాకు చెప్పొద్దు అనుకున్నాట్ట...నాకేం భయంలేదు అన్నాను. పోయేటప్పుడు పోతాం... జరగాల్సింది జరుగుతుంది. ముందే ఊహించు కొని భయపడటం ఎందుకని నేనెంత చెప్పినా ఈయన ధోరణి మారటం లేదు'' అంది అన్నపూర్ణ.

''నువ్వు మారాలి గోవింద్...అతడెవరో చెప్పి నంత మాత్రాన నువ్వు అన్నపూర్ణకేదో అవుతుందని అదేపనిగా ఆలోచిస్తున్నావంటే నీ అంతరాంత రాల్లో ఎక్కడో అన్నపూర్ణ చనిపోవాలని కోరు కుంటున్నావని అర్థం చేసుకోవలసి వస్తుంది'' అన్నాడు సుదర్శన్‌రావు.

''రామ...రామ...ఎంతమాటన్నావు సుదర్శన్. అన్నపూర్ణను నేను త్రికరణ శద్ధిగా ప్రేమిస్తున్నాను. ఆమెలేని జీవితాన్ని నేను ఊహించుకోలేను'' అన్నాడ గోవిందరెడ్డి.




''ఆమె చనిపోవాలన్న కోరిక నీలో ఉందని నీకు తెలియకపోవచ్చు. ప్రతి మనిషిలోను 'అన్‌కా న్షియస్' అంటే మనకు తెలీని ప్రపంచమొకటి ఉంటుందట. నీ అన్‌కాన్షియస్‌లో అలాంటి కోరిక ఉందేమోనని... అందుకే ఆ పిచ్చి జ్యోతిష్కుడు చెప్పిందాన్ని గురించి ఇంత తీవ్రంగా ఆలోచిస్తు న్నావేమోనని నా అనుమానం'' అన్నాడు సుదర్శ న్‌రావు.

''ఛీఛీ! అలాంటిదేమీలేదు. నీకు తెలసిన సిద్ధాంతాలనన్నింటినీ నామీద రుద్దటానికి ప్రయ త్నించకు సుదర్శన్!''

అంతటితో ఆ రోజు ఆ చర్చ ముగిసింది.

మరో నెలరోజులు గడిచాయి.

అన్నపూర్ణను రాబోయే గండం నుండి రక్షించ డానికేవైనా మార్గాలున్నాయా అని గోవిందరెడ్డి తనకు తెలిసిన కొందరు వేదపండితులను అడి గాడు. కొన్ని యజ్ఞాలు చెయ్యాలని వాళ్ళు సూచించారు.

ఫలానా యజ్ఞం చేయిద్దామని గోవిందరెడ్డి కొడుకుతో అన్నాడు.

''మీకిదేం పిచ్చి నాన్నగారూ! అమ్మకేమీకా దు... ఒకవేళ మీరు నమ్మిన సిద్ధాంతం ప్రకారం అమ్మకేదైనా ప్రమాదం జరగాలని విధినిర్ణ యించిందే అనుకోండి. విధి నిర్ణయాన్నెవరూ ఆప లేరుగదా... ఎందుకీ యాజ్ఞాలు యాగాలు...బోల్డు డబ్బులు దండగ''అంటూ కృపాకర్‌రెడ్డి విసుక్కు న్నాడు.

అయినా గోవిందరెడ్డి ఊరుకోలేదు.

బ్రాహ్మణోత్తములను పిలిపించాడు. చండీ యాగమని, రుద్రయాగమని... వరసగా వారం రోజులు యజ్ఞాలు చేయించాడు. ఓ ఇరవై వేల దాకా ఖర్చు చేశాడు.

''మీకిదేం పిచ్చి నాన్న! అబ్సెసివ్ థింకింగ్ అంటారు. మీకా జబ్బు పట్టుకుంది. నాకు తెలిసిన ఓ సైకియాట్రిస్ట్ ఉన్నాడు. మిమ్మల్ని ఆయనకో సారి చూపిస్తాను'' అన్నాడు కృపాకర్‌రెడ్డి.

''అక్కల్లేదు..నాకేంకాలేదు'' కోపంగా అన్నాడు గోవిందరెడ్డి.

యజ్ఞాలు, యాగాలు చేశాను కాబట్టి తన భార్యకేమీకాదని తనను తాను నమ్మించుకోవడా నికి గోవిందరెడ్డి తీవ్రంగా ప్రయత్నించాడు.

గోవిందరెడ్డికి డెబ్బయ్యేళ్ళు నిండటానికి ఒక నెలరోజులు మాత్రమే మిగిలిపోయాయి. దాంతో గోవిందరెడ్డిలో తీవ్రమైన టెన్షన్ ప్రారంభమ య్యింది.

కానీ అన్నపూర్ణకు ఎలాంటి ప్రమాదం జరగ లేదు.

ఆ నెలరోజులు కూడా చాలా మామూలుగానే గడిచిపోయాయి.

గోవిందరెడ్డి గుండెలనిండా ఊపిరి పీల్చుకు న్నాడు.

అతని సప్తతి ఉత్సవాన్ని బ్రహ్మాండంగా జరి పించారు. డాక్టర్‌గా కృపాకర్‌రెడ్డికి ఆ ఊర్లో చాలా

మంచిపేరుంది. దాంతో చాలామంది ఆ ఊర్లోని వీ.ఐ.పీలందరూ ఆ ఉత్సవానికి హాజరయ్యారు. వాళ్ళ బంధువులు, స్నేహితులు కూడా చాలా పెద్ద సంఖ్యలో ఆ ఉత్సవానికొచ్చారు.

వేదబ్రాహ్మణులు వేదపఠనం చేస్తోంటే అన్నపూర్ణనూ, గోవిందరెడ్డినీ పట్టువస్త్రాలతో అలంకరించారు. పూలమాలలతో ముంచేశారు. వాళ్ళది ఆదర్శదాంపత్యమని కొనియాడారు. వాళ్ళింకో వంద సంవత్సరాల వరకు ఆది దంపతులు శివపార్వతుల్లా ఇలాగే కాపురం చెయ్యాలని ఆకాంక్షించారు.

వచ్చిన అతిథులందరికీ గొప్ప విందు ఏర్పాటు చేశారు. అందరూ ఆ విందారగించి వెళ్ళిపోయారు.

అన్నపూర్ణకిక గండం తప్పిందని, తను చేసిన పూజలు, యజ్ఞయాగాదులే ఆమెను రక్షించాయని గోవిందరెడ్డి సంతోషించాడు.

సప్తతి ఉత్సవం జరిగిన రాత్రి వాళ్ళిద్దరు నూతన దంపతుల్లా చాలా హాయిగా గడిపారు.

ఆ రాత్రి తెల్లవారుతుండగా అన్నపూర్ణ బాత్‌రూంలోకెళ్ళి కాలుజారి పడిపోయింది. మళ్ళీ లేచి నిల్చోలేకపోయింది.

వెంటనే ఎక్స్‌రే తీశారు.

కుడికాలి తొంటి విరిగిందని ఎక్స్‌రేలో స్పష్టంగా కనిపించింది. అనెస్తీషియా ఇచ్చి ఆపరేషన్ చేస్తే తప్ప కాలు అతకదని కృపాకర్‌రెడ్డి స్నేహితుడు డాక్టర్ శ్రీనివాసరెడ్డి అనే ఆర్థోపెడీషియన్ చెప్పాడు. ఈ వయస్సులో అన్నపూర్ణ ఈ ఆపరేషన్‌కు తట్టుకుంటుందా అన్న అనుమానం కల్గింది. కానీ ఆపరేషన్ చేసి కాలును సరిచెయ్యకపోతే ఆమె జీవితాంతం మంచంలోనే ఉండిపోవాల్సి వస్తుందన్నాడు డాక్టర్ శ్రీనివాసరెడ్డి.

అన్నపూర్ణకి ఆపరేషన్ చేశారు.

అనెస్తీషియా వల్ల కల్గిన మత్తులోంచి పూర్తిగా కోలుకోకముందే అన్నపూర్ణ చనిపోయింది.

ఆస్థాన జ్యోతిష్కుడు చెప్పింది మరోసారి నిజమైందనుకున్నాడు గోవిందరెడ్డి.

''నువ్వు అన్నపూర్ణ చనిపోతుందని అనుకోవడం వల్లనే ఆమె చనిపోయింది'' అన్నాడు సుదర్శన్‌రావు.

ఇద్దరు మిత్రులు మరోసారి చాలాసేపు ఈ విషయం గురించి చర్చించుకున్నారు.

''ఎందుకీ చర్చంతా? నా దృష్టిలో ఎన్నో సంఘటనలు యే అర్థంపర్థం లేకుండానే జరుగుతాయి. వాటి వెనక యేదో అర్థం ఉందనో, యేదో సిద్ధాంతం ఉందనో వెతకడం శుద్ధ దండగ'' అన్నాడు కృపాకర్‌రెడ్డి.

భార్యపోయిన దిగులులోంచి గోవిందరెడ్డి త్వరగానే కోలుకున్నాడు. ఆయనకు పుస్తకాలు చదివే అలవాటుంది. ఉదయం పదిగంటల వరకు ఆయనకు పూజలు, పునస్కారాలతో గడిచిపోయేది. పదిగంటల నుండి ఆ రోజు పేపర్ ఆమూలాగ్రం చదివేవాడు. మధ్యాహ్నం భోజనం చేసి కాస్సేపు పడుకునేవాడు. తర్వాత మహాభారతమో, రామాయణమో, భాగవతమో చదువుతూ సాయంత్రం ఆరింటిదాకా గడిపేవాడు. తర్వాత టీవీలో వార్తలు, సీరియల్స్ చూసేవాడు.

ఆయనకు ఆరోగ్య సమస్యలంటూ యేమీ లేవు. షుగర్, బీపీలాంటి దీర్ఘవ్యాధులేవీ లేవు. కళ్ళు, చెవులు, దంతాలు మొదలైన వన్నీ ఆరోగ్యంగానే ఉన్నాయి. అప్పుడప్పుడు అతని మిత్రుడు సుదర్శన్‌రావొచ్చినప్పుడు ఎన్నో కబుర్లు చెప్పుకుంటూనో, యేదన్నా సిద్ధాంతాన్ని గుర్చి వాదించుకుంటూనో కాలక్షేపం చేసేవాడు. ఇలా మరో రెండేళ్ళు గడిచిపోయాయి.

రెండేళ్ళకొకసారి వాళ్ళింటికొచ్చే వాళ్ళ ఆస్థాన జ్యోతిష్కుడొచ్చాడు. ఈసారి అతడేం చెప్పిపోతాడోనని ఆ ఇంట్లో అందరూ భయపడిపోయారు.

''మీరు నిండా నూరేళ్ళు బతుకుతారు. కానీ మీకు వచ్చే జూలై నెలలో ఓ గండం ఉంది. జూలై పదిహేనవ తేదీ దాటిందంటే మీకిక ఎలాంటి సమస్యా ఉండదు. జూలై నెలలో మీకొచ్చే గండం తప్పిపోతుందన్న సూచనలు కూడా కనిపిస్తున్నాయి. కాబట్టి ధైర్యం ఉండండి. జూలై పదిహేనవ తేదీ వెళ్ళేంతవరకు మీరు బయటకు వెళ్ళకండి...కృష్ణా, రామ అనుకుంటూ రామాయణ, భారత, భాగవతాలు పారాయణం చేస్తూ ఇంట్లోనే ఉండండి. అవి మిమ్మల్ని కాపాడ్తాయి'' అని చెప్పేసి యథాప్రకారం తన పారితోషికాన్ని స్వీకరించి ఆ జ్యోతిష్కుడు వెళ్ళిపోయాడు.

ఈ విషయం గోవిందరెడ్డి సుదర్శన్‌రావుకు చెప్పాడు.

''అతడు మళ్ళీ నీ బుర్రను చెడగొట్టిపోయాడన్నమాట. నీ పిచ్చినతడు చక్కగా క్యాష్ చేసుకుంటున్నాడు'' అన్నాడు సుదర్శన్‌రావు.

''లేదు సుదర్శన్..అతడు మహాజ్ఞాని. ఆ మహానుభావుడ్ని గుర్చి నువ్వలా మాట్లాడకూడదు. అతనికి డబ్బంటే గడ్డిపోచతో సమానం'' అన్నాడు గోవిందరెడ్డి.

''అతడు వచ్చాడంటేనే మళ్ళీ యేం చెప్పిపోతాడోనని నేను భయపడ్తూనే ఉన్నాను'' అన్నాడు సుదర్శన్‌రావు.

''నన్నతడు ధైర్యంగా ఉంటావో యేమో! నీ పిచ్చి నాకు తెలీదా?'' అన్నాడు సుదర్శన్‌రావు.

ఇదివరకు ఊర్లో ఎక్కడన్నా భారతం మీదనో, రామాయణం మీదనో ఉపన్యాసాల కార్యక్రమం ఉందంటే గోవిందరెడ్డి అక్కడికి తప్పకుండా వెళ్తుండేవాడు. జీయర్‌స్వామి ఉపన్యాసాలంటే కూడా ఆయనకు చాలా ఇష్టం. ఊర్లోకి చినజీయర్ స్వామి వచ్చాడంటే ఆయన్ను చూసి పాదాభివందనం చెయ్యడానికి, ఆయన చెప్పే ఆధ్యాత్మిక విషయాల్ని వినడానికి పరుగెత్తుకొని వెళ్ళేవాడు, ఈ సారి మాత్రం ఆ ఊర్లో ఇలాంటి కార్యక్రమాలెన్ని జరిగినా వెళ్ళకుండా ఇంట్లోనే ఉండిపోయాడు.


బాత్‌రూంకి వెళ్ళినప్పుడు అతి జాగ్రత్తగా వెళ్తొస్తుండేవాడు.

జూలై ఒకటవ తేదీ వచ్చేసింది. ఆయన గుండెల్లో వణుకు ప్రారంభమైంది. అయినా ప్రశాంతంగా ఉండటానికే ప్రయత్నించాడు.

ఆ రోజంతా భగవద్గీతను పారాయణం చేస్తూ ఒక అద్భుతమైన పారవశ్యానికి లోనయ్యాడు.

ఆత్మకు చావులేదు. జీర్ణమైపోయిన వస్త్రాలను విడిచి నూతన వస్త్రాలను ధరించినట్టుగా ఆత్మ ఒక శరీరాన్ని వదిలి మరో శరీరాన్ని ఆశ్రయిస్తుందని శ్రీకృష్ణుడు చెప్పిన భాగాల్ని మళ్ళీమళ్ళీ చదువుకున్నాడు. ''చంపుతున్నది నువ్వు కాదు...నువ్వు కేవలం నిమిత్తమాత్రుడివి మాత్రమే...అంతా నేనే'' అని చెప్పే శ్లోకాన్ని పదేపదే చదివి దాని తెలుగు తాత్పర్యాన్ని, దాని వ్యాఖ్యానాన్ని చదివి చాలాసేపు ఆలోచించాడు.

జూలై నెలలో మొదటి తేదీ ఇలా ప్రశాంతంగా గడిచిపోయింది కాబట్టి ఆ నెలంతా ఇలాగే గడిచిపోతుందని అనుకున్నాడు. ఆయనకో నమ్మకం ఉంది. నెలలో మొదటి రోజు ఆనందంగా గడిచిపోతే నెలంతా అలాగే గడిచిపోతుందని అతడనుకుంటాడు.



ఆ మర్నాడు...అంటే జూలై రెండో తేదినాడు ఆయన బెడ్‌మీద చాలాసేపు మహాభారతంలోని భీష్మపర్వంలోని పద్యాలను, వాటి తాత్పర్యాలను చదువుతూ కాస్సేపు కునుకు తీశాడు. అప్పుడు మధ్యాహ్న భోజనం చేసే టైమయ్యింది.

''భోజనానికి రండి మామయ్యా!'' అని వాళ్ల కోడలు పిలువగానే ఆయనకు మెలకువ వచ్చింది. ఆయన మెల్లగా లేచి కాస్సేపు కూర్చున్నాడు. ఆయన పది అడుగుల దూరం మాత్రమే నడిచి డైనింగ్ టేబుల్ దగ్గరకు వెళ్ళడానికి లేచి నిల్చోబోయాడు. ఆ క్షణంలో ఆయన నిల్చోవడానికి ఆయన కాళ్ళు సహకరించలేదు. ఆయన ఎడమ కాలి మోకాలు మలచుపోవడంతో పూర్తిగా నిల్చోకముందే నేలమీద కూలబడిపోయాడు.

''ఏమీ కాలేదులే'' అనుకొని మళ్లీ లేచి నిల్చోవడానికి ప్రయత్నించాడు.

కానీ నిల్చోలేకపోయాడు. నొప్పితో విలవిల్లాడిపోతూ 'అమ్మా!' అంటూ కేకేశాడు.

''యేమైంది మామయ్యా!'' అంటూ వంటగదిలో ఉన్న ఉన్న వాళ్ళకోడలు అతని దగ్గరకొచ్చింది.

''కాలు బెణికి పడిపోయాను'' అన్నాడు.

వాళ్ళింట్లో పనిచేసే పని పిల్లాడి సహాయంతో అతన్ని లేపి పక్కమీద పడుకోబెట్టారు

ఈలోగా ఈ విషయం కృపాకర్‌రెడ్డికి తెలిసింది.

వెంటనే ఆయన ఆయన ఫ్రెండ్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, అర్థోపెడిషీయన్‌ను పిలిపించాడు.

గోవిందరెడ్డిని ఎక్స్‌రే రూంకు తీసికెళ్లి ఎడమ కాలి ఎక్స్‌రే తీశారు. ఎడమకాలు తొంటి విరిగినట్టు ఎక్స్‌రే చూపించింది.

''ఆపరేషన్ చేసి సరిచెయ్యవచ్చు. మూడు వారాల్లో లేచి తిరుగుతాడు'' అన్నాడు డాక్టర్ శ్రీనివాసరెడ్డి.

గోవిందరెడ్డిని ఆపరేషన్ థియేటర్‌లోకి తీసికెళ్తొంటే ''నేను ఈ నెల పదిహేనో తేదిదాకా బతుకుతానా?'' అన్నాడు కొడుకు కృపాకర్‌రెడ్డితో

''స్మాల్ ఫ్రాక్చర్ నాన్నా! నీకేంకాదు...యేదేదో ఊహించుకోకు'' అన్నాడు కృపాకర్‌రెడ్డి.

''నువ్వు దృఢంగా బతకాలని కోరుకుంటే బతుకుతావు'' అన్నాడు అక్కడే ఉన్న సుదర్శన్‌రావు.

''మన చేతుల్లో యేముంది. ఆపైవాడిదయ'' అన్నాడు గోవిందరెడ్డి.

''అంతా నీ మనసులోనే ఉంది'' అన్నాడు సదర్శన్‌రావు.

గోవిందరెడ్డిని ఆపరేషన్ థియేటర్లోకి తీసికెళ్ళి అనెస్తీషియా ఇచ్చారు మోకాలులో రాడ్ వేశారు. తొంటిదగ్గర ప్లాస్టర్ వేశారు. కాలుకు పదికిలోల బరువు కట్టి బయటకు తీసుకొచ్చారు.

''మీ డాడీ త్వరలోనే కోలుకుంటాడు. నోప్రాబ్లెమ్'' అన్నాడు కృపాకర్‌రెడ్డితో డాక్టర్ శ్రీనివాసరెడ్డి.

మత్తులోంచి పూర్తిగా బయటపడ్డాక గోవిందరెడ్డి హుషారుగానే కనిపించాడు.

మూడు రోజుల తర్వాత ఆయనకు లోబీపి సమస్య వచ్చింది. వీక్‌నెస్ వల్ల వచ్చిందని సెలైన్ బాటిల్స్ ఎక్కించడం మొదలెట్టారు. దాంతో ఆయన గుండెలోకి నీరు చేరి గుండె బరువెక్కింది. శ్వాస తీసుకోవడం కష్టమైపోయింది.

కార్డియోలజిస్టును పిలిపించారు.

''ఫరవాలేదు. మైల్డ్ స్ట్రోకొచ్చింది. సెలైన్ బాటిల్స్ ఎక్కించడం ఆపేయండి. ఆక్సిజన్ పెట్టండి'' అన్నాడాయన.

''నేను పదిహేనో తేదిదాకా బతుకుతానా డాక్టర్?'' అన్నాడు గోవిందరెడ్డి.

''బతుకుతారండి. యేం ఫరవాలేదు. మీరు ధైర్యంగా ఉండాలి. ఎక్కువ ఆలోచించకండి'' అన్నాడు గుండెజబ్బుల డాక్టర్.

మరో రెండ్రోజుల్లో గోవిందరెడ్డి పరిస్థితి చాలా మెరుగయ్యింది.

ఆయన్ను శ్రీనివాసరెడ్డి హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ చేశారు. గోవిందరెడ్డిని ఇంటికి తీసుకొచ్చి ఆయన ఎప్పుడూ పడుకునే బెడ్ మీద పడుకోబెట్టారు.

''నాకు ఆ హాస్పిటల్లోనే బాగుంది. నన్ను మళ్లీ అక్కడికే తీసికెళ్ళండి'' అన్నాడు గోవిందరెడ్డి.

''ఎందుకు నాన్నా?'' అన్నాడు కృపాకర్‌రెడ్డి.

''నేనిక్కడుంటానని యమకింకరులకు తెలుసు..అక్కడుంటానని వాళ్ళకు తెలియదు కదా'' అన్నాడు గోవిందరెడ్డి మత్తులోకి జారిపోతూ

''పరాకు మాటలు మొదలయ్యాయి'' అనుకున్నాడు కృపాకర్‌రెడ్డి.

మరో రెండ్రోజులు గడిచాయి.

''జూలై పదిహేను లోగా ఇక్కడికి యమకింకరులొస్తారు...నన్ను శ్రీనివాసరెడ్డి హాస్పిటల్‌కు తీసికెళ్ళండి, అక్కడికైతే వాళ్ళురారు'' అంటూ గోవందరెడ్డి పదేపదే నిద్రలో కలువరించడం మొదలెట్టాడు.

ఈలోగా అతని మూత్రపిండాలు పనిచెయ్యడం లేదని ఆయనను చూడటానికొచ్చిన డాక్టర్ శ్రీనివాసరెడ్డి గుర్తించాడు. ఆయనను మళ్లీ హాస్పిటల్‌కు తరిలించారు. యూరాలజిస్ట్‌ను పిలిపించారు.

ఆయన చూసి నెఫ్రాలజిస్టును పిలిపించండని సలహా ఇచ్చాడు. నెఫ్రాలజిస్టు కూడా వచ్చి చూశాడు. తనను చూడటానికొచ్చిన ప్రతి డాక్టర్‌ను ''నేను పదిహేనో తేదిదాకా బతుకుతానా డాక్టర్!'' అని అడగటం మొదలెట్టాడు.

డాక్టర్లందరూ సమావేశమై గోవిందరెడ్డి పరిస్థితిని చర్చించారు. ''డయాలసిస్'' చెయ్యాలన్నారు. ''అందుకాయన హార్ట్ సహకరించకపోవచ్చు'' అన్నారు. ఈ లోగా ఆయనకు మళ్ళీ బీపీ పడిపోవడం ప్రారంభమైంది.

''నేను జూలై పదిహేను దాకా బతుకుతానా?'' అని ఆయన పదేపదే అందర్నీ అడగటం డాక్టర్లను ఆశ్చర్యపరచింది.

''ఈయన ఈనెల పదిహేను దాకా బతికితే బతుకుతాడు. లేకపోతే పోతాడు'' అనుకున్నాడు సుదర్శన్‌రావు.

''అదిగో... యమకింకరులు... నేనిక్కడున్నట్లు మీకెలా తెలిసింది... పదిహేను దాకా మీరు నా దగ్గరకు రావొద్దు...'' అని కలవరించడం ఎక్కువైపోయింది.

''ఎలాగైనా మా నాన్నను ఈ నెల పదిహేను దాకా బతికించండని కృపాకర్‌రెడ్డి డాక్టర్లను వేడుకున్నాడు.

''యేం ఫరవాలేదు..జూలై పదిహేనుదాకా తప్పకుండా బతుకుతాడు. పెద్ద క్రిటికల్ కండీషన్‌లో యేమీలేడు'' అన్నారు డాక్టర్లు.

ప్రతిరోజూ సుదర్శన్‌రావొచ్చి ''పదిహేనోతేదీ లోగా నేను చనిపోతాననే భావనను నీ బుర్రలోంచి తీసెయ్యాలి గోవింద్!'' అని చెబుతూనే ఉన్నాడు.

కానీ ఫలితం లేకపోయింది.

పన్నెండవ తేదినాడు గోవిందరెడ్డి చివరిశ్వాస విడిచాడు.

''భార్యాభర్తలిద్దరూ ఒకే రకంగా చనిపోయార'ని వాళ్ల బంధువర్గమంతా చెప్పుకున్నారు.

''అంతా దైవనిర్ణయం'' అన్నారందరూ.

''కాదు. అతడి నిర్ణయమే. అతనిలోని మరణ కాంక్షే అతన్ని చంపేసింది'' అన్నాడు సుదర్శన్‌రావు.

''అతడి నిర్ణయమూకాదు. దైవనిర్ణయమూ కాదు. యాదృచ్ఛికంగా జరిగిందంతే! ఈ కారణం వల్ల జరిగిందని దానికేదో మనకిష్టమైన,మనం నమ్మిన తాత్త్విక సిద్ధాంతాన్ని అన్వయించడం కేవలం మనతృప్తికోసమే. అసలు మానవజీవితానికి అర్థం లేదు. కానీ యేదో అర్థాన్ని అన్వేషించడానికి మానవుడెప్పుడూ తాపత్రయపడ్తూనే ఉంటాడు.

మానవ సంకల్పమనీ, దైవసంకల్పమనీ యేవేవో సిద్ధాంతాలను చేస్తూనే ఉంటాడు. చాలా సంక్లిష్టమైన మానవ జీవితాన్ని యేదో ఒక సిద్ధాంతం అనే చట్రంలో బిగించడానికి ప్రయత్నిస్తూనే ఉంటాడు'' అన్నాడు కృపాకర్‌రెడ్డి.

''నిజమే. కానీ మనల్ని మనం యేదో ఒక సిద్ధాంతచట్రంలో బిగించుకోకపోతే తృప్తిగా బతకలేం. అందుకే ఇన్ని సిద్ధాంతాలు.. ఇన్ని మతాలు... ఇంతమంది దేవుళ్ళు... ఇన్ని గుళ్ళు... ఇన్ని గోపురాలు... ఇన్ని పూజలు... ఇన్ని పునస్కారాలు... ఇన్ని యజ్ఞాలు...యాగాలు'' అన్నాడు సుదర్శన్‌రావు.

''అవును మనిషికి కావాల్సింది పూర్తి సత్యంకాదు. ఆత్మతృప్తి. బహుశా అసలు అబ్సల్యూట్ ట్రూత్ అనేది లేనేలేదేమో. ఉన్నా మనకది తెలియదేమో! యేదో ఉందనుకొని తృప్తిపడాలి. అంతే!'' అన్నాడు కృపాకర్‌రెడ్డి.

★